# తప్పు చేస్తే తీవ్ర చర్యలు

## ఎక్సైజ్ అధికారులకు మంత్రి నారాయణస్వామి హెచ్చరిక



**సాక్షి, అమరావతి:** తప్పు చేసే ఎక్సైజ్ అధికారులపై తీవ్ర చర్యలుంటాయని డిప్యూటీ సీఎం, ఎక్సైజ్ శాఖ మంత్రి కె.నారాయణస్వామి హెచ్చరించారు. సచివాలయంలో గురువారం ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ అధికారుల సంఘం డైరీని మంత్రి ఆవిష్కరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఇటీవలి కాలంలో ఎక్సైజ్ అధికారులపై ఆరోపణలొస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వ మద్యం షాపుల అద్దెల్లో అక్రమాలకు ఊతమిస్తున్నారని సమాచారం అందుతోందన్నారు. దశలవారీ మద్య నిషేధ కార్యక్రమానికి ఎక్సైజ్ అధికారులు ఆటంకాలు కల్పించేలా వ్యవహరిస్తే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు. రాష్ట్రంలో టీడీపీ ముఖ్య నేతల అక్రమ మద్యం దందాను అడ్డుకునేందుకు ఎందుకు భయపడుతున్నారని మంత్రి ప్రశ్నించారు. ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి నేరుగా బార్లకు లిక్కర్‌ను సరఫరా చేస్తున్నారని, ఇవన్నీ తెలిసినా కొందరు సీఐలు ఉద్దేశపూర్వకంగా వదిలేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్యం డిపోల్లో డీఎంల వ్యవహార శైలిని గమనించాలని ఏపీఎస్‌బీసీఎల్ ఎండీ వాసుదేవరెడ్డిని ఆదేశించారు. నాటుసారా తయారీ, అక్రమ మద్యంపై ఉక్కుపాదం మోపాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ హరికుమార్‌కు సూచించారు.

# చంద్రబాబుకు మతిభ్రమించింది

## అసత్య ప్రచారంపై మండిపడ్డ బీసీ సంక్షేమ శాఖ మంత్రి



**పెనుకొండ:** కియా కార్ల పరిశ్రమ తరలిపోతుందనే అసత్య ప్రచారంపై రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి మాలగుండ్ల శంకరనారాయణ మండిపడ్డారు. గురువారం అనంతపురం జిల్లా పెనుకొండ పట్టణంలోని తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారంజక పాలన చూసి చంద్రబాబుకు కడుపు మండుతోందన్నారు. కల్లుతాగిన కోతిలా తన ఎల్లో మీడియా ద్వారా అసత్య ప్రచారాలతో ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. ఇప్పుడు కియా కార్ల పరిశ్రమ తరలిపోతోందనే పుకార్లతో కొత్తపల్లవి అందుకున్నారన్నారు. రాష్ట్రంలో ప్రజలు సంతోషంగా ఉండటం ఆయనకు ఇష్టం లేదన్నారు. ఇసుక దగ్గర నుంచి ఇంగ్లిష్ వరకు చేసిన తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మకపోవడంతో కియా కార్ల పరిశ్రమపై విష ప్రచారం చేస్తున్నారన్నారు.

# పదెకరాల నిబంధనను తొలగించండి

**సాక్షి, అమరావతి:** రేషన్ కార్డుల జారీకి ప్రకటించిన మార్గదర్శకాల్లో వెనుకబడిన, కరవు పీడిత ప్రాంతాలకు మినహాయింపు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. రాష్ట్రంలోని 9 జిల్లాలు నిరంతరం కరవు పీడిత ప్రాంతాలుగా ఉన్నాయని, ఆ జిల్లాల్లోని రైతులకు పది ఎకరాల నిబంధనను వర్తింపజేయొద్దని సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వై.కేశవరావు, పి.పెద్దిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. రెండేళ్లుగా రైతాంగానికి పంట నష్టపరిహారాలు, ఇన్‌పుట్ సబ్సిడీలు, మొక్కజొన్న, శనగలకు ఇస్తామన్న సబ్సిడీలు రూ.వేల కోట్లు బకాయిలు ఉన్నాయని వివరించారు. ఈ పరిస్థితుల్లో రైతుల ఇక్కట్లను దృష్టిలో పెట్టుకుని రేషన్ కార్డుల మంజూరులో మినహాయింపు ఇవ్వాలని కోరారు.

# మోదీ పాలనలో రాజ్యాంగం అపహాస్యం

## సీపీఐ జాతీయ సమితి కార్యదర్శి కె.నారాయణ

**నర్సీపట్నం:** రాబోయే రోజుల్లో భారత ఆర్మీ ద్వారా ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యేందుకు ప్రధాని మోదీ కుట్రలు చేస్తున్నారని సీపీఐ జాతీయ సమితి కార్యదర్శి కె.నారాయణ ఆరోపించారు. విశాఖ జిల్లా నర్సీపట్నంలో అల్లూరి సీతారామరాజు భవన్ పేరుతో నిర్మిస్తున్న సీపీఐ కార్యాలయం, కామ్రేడ్ గొడ్డేటి దేముడు సమావేశ మందిరం నిర్మాణానికి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో నారాయణ మాట్లాడుతూ.. స్వయం ప్రతిపత్తి కలిగిన రక్షణ, సీబీఐ, ఎన్నికల కమిషన్ వంటి సంస్థలను ప్రధాని శాసిస్తూ రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ విధానాలతో దేశ ఆర్థిక వ్యవస్థ నాశనమవుతోందన్నారు. వికేంద్రీకరణ పేరుతో ఏపీలో మూడు రాజధానులు ఏర్పాటు తప్పన్నారు. హైకోర్టు ఎక్కడ పెట్టినా తమకు అభ్యంతరం లేదని, భార్యాభర్తల వంటి సంబంధం కలిగిన అసెంబ్లీ, ఎగ్జిక్యూటివ్‌లను వేర్వేరు చోట్ల పెట్టడం సరికాదని చెప్పారు.

# కాలువల ప్రక్షాళనకు రంగం సిద్ధం

- ‘మిషన్ ఫర్ క్లీన్ కృష్ణా, గోదావరి కెనాల్స్’ పేరిట కార్యాచరణ
- మొదటి దశలో 1,344 కిలోమీటర్లు బాగు చేయాలని నిర్ణయం

**తాడేపల్లిరూరల్ (మంగళగిరి):** కాలువల రూపురేఖలు మార్చేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. ఇందుకోసం మిషన్ ఫర్ క్లీన్ కృష్ణా, గోదావరి కెనాల్స్ (ఎంసీకేజీసీ) అనే పేరుతో కార్యాచరణ రూపొందించారు. పలు శాఖలకు చెందిన అధికారులు సభ్యులుగా ఏర్పడిన కమిటీకి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చైర్మన్‌గా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. ఈ మేరకు తాడేపల్లి, మంగళగిరి పట్టణ, మండల అధికారులతో కమిటీ సభ్యులు గురువారం విజయవాడలో సమావేశం నిర్వహించారు. మొదటి దశలో కృష్ణా, గోదావరి నదుల కింద అనుసంధానంగా ఉన్న పెద్ద కాలువలను, వాటి కింద ఉన్న ఉప కాలువలను, చిన్న కాలువలను ఎలాంటి కాలుష్యం లేకుండా 1,344 కిలోమీటర్ల మేర బాగుచేయాలని నిర్ణయించారు. గుంటూరు చానల్‌తో పాటు, బకింగ్‌హామ్ కెనాల్, రైవస్ కాలువ, బందరు కాలువ, ఏలూరు కాలువ వంటి వాటిని సర్వే చేయనున్నారు. కాలువ ఒడ్డున ఉన్న పట్టణాల్లో, గ్రామాల్లో ఏయే ప్రాంతాలు ఆక్రమణలకు గురయ్యాయి? ఎంతమంది నివసిస్తున్నారు? ఎన్ని దోబీఖానాలు ఉన్నాయి? వాటిని ఎక్కడికి తరలించాలి? అనే అంశాలపై సర్వే నిర్వహిస్తారు. ఈ కాలువల్లో మురుగునీరు, ఇతర వ్యర్థాలు కలవకుండా చూడడంతో పాటు, అలా కలిసే ప్రాంతాల దగ్గర నీటి శుద్ధి కేంద్రాలను ఏర్పాటుచేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. దీనిపై తాడేపల్లి మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి మాట్లాడుతూ.. ఎంసీకేజీసీ కమిటీలో ముఖ్యమైన పాత్ర ఇరిగేషన్ శాఖ చూస్తుందని, వారికి సహాయ సహకారాలుగా స్థానిక సంస్థల అధికారులు ఉంటారని చెప్పారు. కాలువల్లో నీరు కలుషితం కాకుండా చూడటమే ప్రధాన ఉద్దేశమని తెలిపారు. త్వరలోనే బకింగ్‌హామ్ కెనాల్ కరకట్ట వెంట ఆక్రమణలను తొలగించి, వారికి వేరే చోట నివాసాలు చూపించి పార్కులు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

isarc
ఇండియా SME అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్
(CIN:U67190MH2008PLC181062)
నమోదిత కార్యాలయం: స్వావలంబన్ భవన్, C-11, G-బ్లాక్, బాంద్రా-కుర్లా కాంప్లెక్స్, బాంద్రా(ఈస్ట్), ముంబాయి-400051. ఫోన్: +91 22 67221556, ఇమెయిల్:isarc@isarc.in, వెబ్‌సైట్:www.isarc.in
సవరణ
సాక్షి: రాజమండ్రి ఎడిషన్‌లో 30-01-2020న ప్రచురించబడిన మా ఇ-వేలం నోటీసుకు నిర్దేశంతో, బిడ్ల స్వీకరణకు ఆఖరు తేది 17-02-2020కు బదులుగా 20-02-2020గా & వేలం తేది 18-02-2020కు బదులుగా 24-02-2020గా మార్చబడినవి.
సదరు నోటీసులో తెలిపిన అన్ని ఇతర నియమ నిబంధనలలో ఎట్టి మార్పు లేదు.
సం/- అధీకృత అధికారి,
తేది: 06-02-2020 ఇండియా SME అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్
ప్రదేశం: ముంబాయి IDBI-II/2013-14 ట్రస్ట్ యొక్క ట్రస్టీగా తన హోదాలో వ్యవహరిస్తోంది

శ్రీమావుళ్ళమ్మ అమ్మవారి దేవస్థానం - భీమవరం
08816 - 232598
E-Procurement Tender Notice RC.No.A1/19/2020, Dt:06.02.2020
శ్రీ అమ్మవారి దేవస్థానమునకు అవసరమైన రసవర్గములు (Provisions) ది.01.04.2020 నుండి ది.30.09.2020 వరకు 6నెలల కాలమునకు సప్లయిచేయుటకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్లు కోరబడుచున్నవి. ప్రధమ ధరావత్తు - 5,00,000/-
Schedule Opening Date 7.2.2020 - 10.00 A.M.
Schedule Sale Closing Date 24.2.2020 - 1.00 P.M.
Bid Submission Closing Date 24.2.2020 - 5.30 P.M.
ఇతర వివరముల కొరకు www.eprocurement.gov.in ద్వారా పొందవచ్చును.
సం/- దాసరి శ్రీరామవరప్రసాదరావు
అసిస్టెంట్ కమీషనర్ &
కార్యనిర్వహణాధికారి

# రూ.33,869 కోట్లతో హరిత సీమ

- రాయలసీమ కరువు నివారణకు ప్రణాళిక
- కృష్ణా నదికి వరద వచ్చే 40 రోజుల్లో నీటిని ఒడిసిపట్టుకోవాలని నిర్ణయం
- రాయలసీమ, నెల్లూరు జిల్లాల్లోని ప్రాజెక్టులు నింపే పనులకు సీఎం జగన్ గ్రీన్ సిగ్నల్



పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యం పెంపు ప్రణాళిక

**సాక్షి, అమరావతి:** దుర్భిక్షానికి చిరునామాగా మారిన రాయలసీమను సుభిక్షంగా మార్చాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంకల్పించారు. కృష్ణా నదికి వరద వచ్చే 40 రోజుల్లో రాయలసీమ, నెల్లూరు జిల్లాల్లో సాగునీటి ప్రాజెక్టులను నింపడం ద్వారా ఆయా ప్రాంతాలను సస్యశ్యామలం చేసేందుకు ప్రణాళిక రచించారు. ఇందులో భాగంగా శ్రీశైలం జలాశయం నుంచి వరద నీటిని ఒడిసిపట్టి.. రాయలసీమ, నెల్లూరు జిల్లాల్లోని ప్రాజెక్టులకు తరలించేందుకు కాలువలు, ఎత్తిపోతల పథకాల సామర్థ్యాన్ని పెంచే పనులను చేపట్టనున్నారు. ఇందుకు రూ.33,869 కోట్ల వ్యయం అవుతుందని జలవనరుల శాఖ అంచనా వేస్తోంది. ఈ పనులకు పరిపాలనా అనుమతి ఇచ్చి.. టెండర్లు పిలవాలని సీఎం వైఎస్ జగన్ ఆదేశించారు. పనులను శరవేగంగా పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

### శరవేగంగా ప్రణాళిక అమలు

రాయలసీమ కరవు నివారణ ప్రణాళికను శరవేగంగా అమలు చేయాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇప్పటికే రాజోలి, జోలదరాశి జలాశయాల నిర్మాణం, చక్రాయిపేట ఎత్తిపోతల, కుందూ ఎత్తిపోతల పథకాలకు సమగ్ర ప్రాజెక్టు నివేదికల తయారీకి సర్కార్ అనుమతి ఇచ్చింది. మిగిలిన పనులకు డీపీఆర్‌లు తయారు చేసి.. ఆ పనులు చేపట్టడానికి పరిపాలనా అనుమతి ఇవ్వాలని ఆదేశించింది.

### కరవు నివారణ ప్రణాళిక

- శ్రీశైలం జలాశయం నుంచి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా తెలుగుగంగ, శ్రీశైలం కుడి గట్టు కాలువ(ఎస్సార్‌బీసీ).. గాలేరు-నగరి సుజల స్రవంతి పథకాలకు నీటిని విడుదల చేస్తారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని 80 వేల క్యూసెక్కులకు పెంచడం, ఆ నీటిని బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్(బీసీఆర్) వరకూ తరలించే పనులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ పనులకు రూ.571 కోట్లు వ్యయం కానుంది.
- శ్రీశైలం జలాశయంలో నీటి మట్టం 854 అడుగుల కంటే తక్కువగా ఉన్నప్పుడు రోజుకు 3 టీఎంసీల చొప్పున బీసీఆర్‌కు తరలించి.. అక్కడి నుంచి రాయలసీమ, నెల్లూరు జిల్లాల ప్రాజెక్టులకు జలాలను సరఫరా చేయడానికి శ్రీశైలం జలవిస్తరణ ప్రాంతం నుంచి ఎత్తిపోతల పథకాన్ని చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి రాయలసీమ ఎత్తిపోతలగా నామకరణం చేసింది. ఈ పథకానికి రూ.3,890 కోట్ల వ్యయం అవుతుందని అంచనా.
- పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి విడుదల చేసే జలాలను పూర్తిస్థాయిలో తరలించేలా నిప్పుల వాగు సామర్థ్యాన్ని 35 వేల క్యూసెక్కులకు పెంచే పనులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వీటికి రూ.1,501 కోట్లు వ్యయం అవుతుంది.
- కుందూ వరద నీటిని ఒడిసిపట్టేలా రాజోలి ఆనకట్టకు ఎగువన 2.95 టీఎంసీల సామర్థ్యంతో ఒక బ్యారేజీ.. జోలదరాశి వద్ద 0.8 టీఎంసీల సామర్థ్యంతో మరో బ్యారేజీ నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పనులకు రూ.1,677 కోట్లు వ్యయం కానుంది.
- పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్‌కు చేరిన జలాలను ఎస్సార్‌బీసీ, గాలేరు-నగరి కాలువల ద్వారా గోరకల్లు జలాశయానికి తరలించడానికి వాటి సామర్థ్యాన్ని 30 వేల క్యూసెక్కులకు పెంచాలని సర్కార్ నిర్ణయించింది. ఈ పనులకు రూ.1,149 కోట్లు వ్యయం అవుతుందని అంచనా.
- గాలేరు-నగరి నుంచి వెలిగల్లు, కాలేటి వాగు, శ్రీనివాసపురం రిజర్వాయర్లను నింపడానికి చక్రాయిపేట ఎత్తిపోతల పథకాన్ని చేపట్టాలని సర్కార్ నిర్ణయించింది. ఈ పనులకు రూ.2,600 కోట్లు అవసరం.
- వైఎస్సార్ జిల్లాలో ముద్దనూరు వద్ద కొత్తగా 20 టీఎంసీల సామర్థ్యంతో ఒక రిజర్వాయర్‌ను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పనులకు రూ.2,700 కోట్ల వ్యయం అవుతుందని అంచనా.
- గాలేరు-నగరి సుజల స్రవంతి పథకం సామర్థ్యం పెంపు పనులకు రూ.6,310 కోట్లు.. రెండో దశలో కాలువల సామర్థ్యం పెంపు.. జిల్లేడుబండ రిజర్వాయర్ నిర్మాణానికి రూ.1,518 కోట్లు అవసరమని అంచనా.

# అమరావతి రైతులు పెయిడ్ ఆర్టిస్టులా?

- చంద్రబాబు మోసాలకు బలైన రైతులే ముఖ్యమంత్రిని కలిశారు
- వచ్చే ఎన్నికల్లో మంగళగిరిలో బాబు పోటీ చేసినా ఓడిపోతారు
- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి స్పష్టీకరణ



**సాక్షి, అమరావతి:** రాజధాని అమరావతి ప్రాంతంలో చంద్రబాబు మోసాలకు, దాష్టీకాలకు బలైన రైతులు, రైతు కూలీలు మాత్రమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారని, తమ గోడు వెళ్లబోసుకున్నారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) చెప్పారు. రైతుల కష్టాలు విన్న సీఎం వైఎస్ జగన్ చలించి పోయారని అన్నారు. రైతులు కోరినవన్నీ వారి అభీష్టం మేరకే చేస్తానని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అక్కడికక్కడే కొన్ని నిర్ణయాలు తీసుకొని, అధికారులకు ఆదేశాలు జారీ చేశారని పేర్కొన్నారు. అమరావతిలో ప్రతి రైతుకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారని వెల్లడించారు. ఆళ్ల రామకృష్ణారెడ్డి గురువారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రిని కలిసిన రైతులు, రైతు కూలీలను పట్టుకొని చంద్రబాబు, నారా లోకేశ్, టీడీపీ నేతలు పెయిడ్ ఆర్టిస్టులని, వారంతా ఆర్కే బంధువులని విమర్శించడం దారుణమన్నారు. సీఎంను కలిసిన రైతుల వివరాలను వారి ఆధార్ కార్డులతో సహా మీడియా ముందు ఉంచుతున్నానని, వారు నిజమైన రాజధాని రైతులు అవునో కాదో తెలుసుకోవచ్చన్నారు.

### సీఎం వద్దకు వెళ్దాం రండి..

‘‘చంద్రబాబు అధికారంలో ఉండగా ల్యాండ్ పూలింగ్ పేరిట బలవంతపు భూసేకరణ చేశారు. ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు పాల్పడ్డారు. వ్యవస్థలన్నింటినీ భ్రష్టు పట్టించారు. చంద్రబాబు, ఆయన తనయుడు నారా లోకేశ్ రూ.వేల కోట్లు దోచుకున్నారు. ఐదేళ్లలో బాబు మంగళగిరిలో అడుగుపెట్టేందుకు భయపడ్డారు. చంద్రబాబు నిజంగా రైతుల పక్షపాతి అయితే మంగళగిరిలో లోకేశ్‌ను ప్రజలు ఎందుకు ఓడించారు? మంగళగిరి నేషనల్ హైవే దగ్గర జయభేరి సంస్థ అపార్టుమెంట్లు నిర్మించింది. అక్కడికి సమీపంలోనే రైతుల భూములు ఉన్నాయి. వాటిలో అపార్ట్‌మెంట్లు కడితే జయభేరి అపార్టుమెంట్లు అమ్ముడుపోవనే కారణంతో వాటిని రిజర్వు జోన్‌లో పెట్టిన విషయం వాస్తవం కాదా? రైతుల సమస్యలపై చంద్రబాబుకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే మాతో కలిసి రావాలి. అందరం కలిసి ముఖ్యమంత్రి వద్దకు వెళ్దాం’ అని ఆర్కే అన్నారు.

# ఆక్వా రంగం అభివృద్ధికి ప్రాధాన్యం

## మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి మోపిదేవి



భీమవరంలో జరిగిన ఆక్వా ఎక్స్ ఇండియా సదస్సులో మాట్లాడుతున్న మంత్రి మోపిదేవి

**భీమవరం:** రాష్ట్రంలో ఆక్వా రంగం అభివృద్ధికి ప్రభుత్వం మరింత ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. గురువారం పశ్చిమగోదావరిలోని భీమవరంలో ఆక్వా ఎక్స్ ఇండియా-2020 ఎగ్జిబిషన్, సెమినార్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మోపిదేవి మాట్లాడుతూ.. విదేశీమారక ద్రవ్యం రూపంలో ఆక్వా రంగం నుంచి కేంద్రానికి 40 శాతం ఆదాయం వస్తోందని, ఇందులో అగ్రస్థానం ఏపీదేనని చెప్పారు. ఈ రంగాన్ని ప్రోత్సహించడానికి విద్యుత్‌ను యూనిట్ కేవలం రూ.1.50కే ఇస్తున్నట్లు చెప్పారు. దీంతో రాష్ట్రప్రభుత్వంపై రూ.770 కోట్ల అదనపు భారం పడుతోందన్నారు. రాష్ట్రంలో 48 ఇంటిగ్రేటెడ్ ఆక్వా ల్యాబ్‌లు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు మాట్లాడుతూ.. ఆక్వా ఉత్పత్తుల పెట్టుబడుల సమయంలో ధర తక్కువగా ఉంటే సరుకును రైతులే నిల్వచేసుకోడానికి కోల్డ్ స్టోరేజీలు నిర్మించడంతోపాటు, రైతులకు నాణ్యమైన సీడ్, ఫీడ్ అందించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. అనంతరం తైవాన్, ఇండోనేసియా దేశాలతోపాటు ఆంధ్రప్రదేశ్, కేరళ, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల నుంచి వివిధ కంపెనీలు ఇక్కడ ఏర్పాటు చేసిన స్టాళ్లను మంత్రులు పరిశీలించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ముదునూరి ప్రసాదరాజు, పుప్పాల వాసుబాబు, మంతెన రామరాజు, తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఖతార్‌లో ఉద్యోగాలకు 12 మంది ఎంపిక

## ఫిబ్రవరి రెండో వారంలో పయనం

**సాక్షి, అమరావతి:** గుంటూరులోని అంతర్జాతీయ నైపుణ్య శిక్షణ సంస్థలో శిక్షణ పొందిన మొదటి బ్యాచ్‌కు చెందిన 12 మంది అభ్యర్థులు ఖతార్‌లోని ఏజే ట్రేడింగ్-కాంట్రాక్టింగ్ డబ్ల్యూఎల్ కంపెనీలో ఉద్యోగానికి అర్హత సాధించి వీసా పొందారు. వీరికి అవసరమైన వైద్య పరీక్షలు పూర్తయిన అనంతరం చెన్నైలో ప్రీ డిపార్చర్ ఓరియంటేషన్ శిక్షణనిస్తారు. ఆ తర్వాత ఫిబ్రవరి రెండో వారంలో వారు ఖతార్‌కు బయల్దేరుతారు. కాగా, తమ సంస్థకు ఎలక్ట్రీషియన్ల అవసరముందని 2019 డిసెంబర్ 23న గుంటూరులోని ఏపీఎస్‌ఆర్టీఎస్, అంతర్జాతీయ నైపుణ్య శిక్షణ సంస్థను ఏజే ట్రేడింగ్-కాంట్రాక్టింగ్ డబ్ల్యూఎల్‌ఎల్ ప్రతినిధులు సందర్శించారు. మొత్తం 14 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. రాత పరీక్ష, ఇంటర్వ్యూ నిర్వహించి 12 మందిని ఎంపిక చేశారు. వీరికి ‘ఇండస్ట్రియల్ ఎలక్ట్రీషియన్’ కోర్సులో 90 రోజుల పాటు అంతర్జాతీయ నైపుణ్య శిక్షణ సంస్థ గల్ఫ్ ప్రమాణాల ప్రకారం ఉచిత శిక్షణనిచ్చింది.

# చెరకు రసం పౌడర్ రెడీ!

## అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తల ఆవిష్కరణ

### ఆమోదించిన భారత వ్యవసాయ పరిశోధన సంస్థ





చెరకు రసం పౌడర్‌ను నీటిలో కలిపిన తర్వాత తయారయ్యే చెరకు రసం

**అనకాపల్లి:** వేసవిలో చెరకు రసం బండి కనిపిస్తే ఒకటి రెండు గ్లాసులు తాగి కాని కదలం. ఎన్నో పోషక విలువలతో పాటు తక్షణ శక్తిని ఇచ్చే గుణం చెరకు రసానికి ఉంది. అందులోనూ కాసింత నిమ్మరసం కలిపితే వేసవిలో మరెంతో మేలు చేస్తుంది. అలాంటి చెరకు రసం ఎప్పుడు కావాలంటే అప్పుడు ఇంట్లోనే తయారు చేసుకుని కాసింత నిమ్మరసం కలిపి లాగించే అవకాశం ఉంటే ఆ మజానే వేరు కదా. దాన్ని నిజం చేస్తున్నారు అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు. చెరకు రసం నుంచి పౌడర్ తయారు చేసే ప్రక్రియను సాధించారు. దీన్ని భారత వ్యవసాయ పరిశోధన సంస్థ సైతం ఆమోదించింది. అనకాపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలోని పంట కోత అనంతర సాంకేతిక పరిజ్ఞాన విభాగం ఇప్పటికే బెల్లం పొడి, బెల్లం ద్రావణం తయారు చేసే సాంకేతిక పరిజ్ఞానాన్ని కనుగొనడంతో బెల్లం చాక్లెట్‌లను తయారు చేసే ప్రక్రియను కనుగొన్నారు. తాజాగా చెరకు రసంతో పౌడర్‌ను తయారు చేసే సాంకేతిక పరిజ్ఞానాన్ని కనుగొన్నారు. గత నెల 23 నుంచి 25 వరకు మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో నిర్వహించిన సదస్సులో భారతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ అనకాపల్లి పంట కోత సాంకేతిక పరిజ్ఞాన విభాగం శాస్త్రవేత్తలు మాధవ, శ్రీదేవి రూపొందించిన చెరకు రసం పౌడర్ తయారు చేసే విధానాన్ని ఆమోదించారు. తయారీ విధానాన్ని ల్యాబొరేటరీలో కనుగొన్నారు. పౌడర్‌ను తయారు చేసే సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించిన యంత్రాన్ని పూర్తిస్థాయిలో రూపొందించాల్సి ఉంది. రైతు లేదా వ్యాపారి స్థాయిలో కనీసం రూ. 25లక్షల విలువైన యంత్రాన్ని కొనుగోలు చేసి చెరకు నుంచి పౌడర్‌ను తయారు చేయవచ్చని శాస్త్రవేత్త మాధవ తెలిపారు.

### ఎక్కడైనా.. ఎప్పుడైనా చెరకు రసం తాగొచ్చు

తక్షణ శక్తి కోసం అవసరమైన పోషకాలు చెరకు రసంలో ఉంటాయి. ఐరన్, కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం, బి-విటమిన్‌తో కూడిన చెరకు రసం కావాలంటే పౌడర్‌ను నీటిలో కలుపుకుంటే చాలు. సుమారు ఎనిమిది నెలల పాటు నిల్వ ఉండే ఈ పౌడర్‌ను ఎక్కడైనా, ఎప్పుడైనా గ్లాసు నీటిలో 10 గ్రాముల పౌడర్ కలిపి తాగితే శక్తికి శక్తి, రుచికి రుచి అందుతుంది.



# యమపురికి యాప్ దారి

- హెల్త్ వెబ్‌సైట్లు, యాప్‌లు, ఆన్‌లైన్ వీడియోలతో వైద్యం ప్రాణాంతకం
- మానవ శరీరంపై ప్రయోగం ఏమాత్రం సమంజసం కాదంటున్న నిపుణులు

☛ ప్రకాశ్ (పేరు మార్చాం) అనే వ్యక్తి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేసేవాడు. అతడికి రెండేళ్ల కింద కుక్క కరిచింది. డాక్టర్ వద్దకు వెళ్తే ఇంజెక్షన్లు వేయించుకోవాలని సూచించారు. ఇంటికొచ్చాక కుక్కకాటు ఇంజెక్షన్లపై వెబ్‌సైట్‌లో, కొన్ని యాప్‌లలో వెతికాడు. ఈ ఇంజెక్షన్ల వల్ల సైడ్ ఎఫెక్ట్స్ వస్తాయని వాటిల్లో ఉంది. దీంతో భయపడిన ప్రకాశ్.. కుక్క కరిస్తే ఏం చేయాలన్న దానిపై ఆన్‌లైన్‌లో వీడియోలు చూశాడు. అందులో జీలకర్ర, ఇంగువ, వెల్లుల్లి వంటివి వాడితే తగ్గుతుంద ని చిట్కాలు తెలుసుకుని, వాటిని పాటించా డు. అలా చేయడం మంచిది కాదని కుటుంబసభ్యులు చెప్పినా వినకుండా.. వితండవాదం చేశాడు. ఇదిలా ఉంటే అతడిని కరిచిన కుక్క వారం రోజులకు చనిపోయింది. ఆ తర్వాత ప్రకాశ్‌కూ రేబిస్ వ్యాధి సోకి 2 నెలల్లోనే చనిపోయాడు.

☛ అతడి పేరు నరేశ్.. ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తాడు. అతడు ఉండాల్సిన బరువు కంటే 20 కేజీలు అధికంగా ఉన్నాడు. ఈ మధ్య వెబ్‌సైట్లు, యాప్‌లలో వైరల్ అయిన ఓ ప్రత్యేక డైట్‌ను అతడు ఫాలో అయ్యాడు. కొవ్వు పెరిగి, అది కిడ్నీలపైనా గుండెపైనా ప్రభావం పడిందని డాక్టర్లు నిర్ధారించారు. దీంతో ఆ డైట్‌ను నిలిపివేసి, వైద్యులు ఇచ్చిన మందులు వాడి ప్రాణాలను కాపాడుకున్నాడు.

- సాక్షి, హైదరాబాద్

ఇంటర్నెట్‌లో, హెల్త్ యాప్‌లలో ఆరోగ్యపరమైన చిట్కాలు పాటిస్తూ అనేకమంది ఎలా ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారో ఈ సంఘటనలే పెద్ద ఉదాహరణ. ఇంటర్నెట్‌లో హెల్త్‌కు సంబంధించి సెర్చ్ చేస్తే కుప్పలు తెప్పలుగా సైట్లు, వీడియోలు, సమాచారం వస్తుంది. అలాంటి వాటిని నమ్మడం మంచిది కాదని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. ప్రసిద్ధి చెందిన వైద్యుల వీడియోలు, యాప్‌లను తప్ప ఇతరత్రా పాటించడం మంచిది కాదంటున్నారు. కొందరు వైద్యశాస్త్రాన్ని నమ్మకుండా చిట్కాలు పాటిస్తూ అవాం తరాలు తెచ్చుకుంటున్నారని చెబుతున్నారు. ఒక అంచనా ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 3.5 లక్షల హెల్త్ యాప్‌లు, వెబ్‌సైట్లు ఉన్నాయి. కొన్ని యాప్‌లు ఎక్సర్‌సైజుకు సంబంధించినవి కాగా, కొన్ని ఆహార నియమాలకు సంబంధించినవి. కొన్నింటిలో ఏ జబ్బుకు ఏ మందులు వాడాలి.. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనేది ఉన్నాయి. కొన్ని ఆన్‌లైన్ వీడియోల్లోనైతే ఆరోగ్య చిట్కాల పేరుతో వందల సైట్లు కనిపిస్తుంటాయి. ఇంటర్నె ట్ విస్తృతి అదనుగా ప్రవేశించిన ఈ మాయదారి యాప్‌లు, వెబ్‌సైట్‌లు కిడ్నీలో రాళ్లు వస్తే ఈ చిట్కాలు పాటించండి.. బరువు ఎక్కువుంటే ఈ చిట్కాలు పాటిస్తే నెల రోజుల్లో 10 కేజీలు తగ్గుతాయ ని చెబు తుంటాయి. కామెర్లు వస్తే పలానా ఆకుర సం తాగాలి వంటివి కనిపిస్తాయి. పాత తరం వాళ్లు ఇలాం టివి పాటించడం వల్లే వారు ఆరోగ్యంగా ఉన్నారని కూడా నమ్మబలుకుతున్నాయి. ఇటువంటి వీడియోలు చూసి మోసపోవద్దని వైద్యులు సూచిస్తున్నారు.

### శరీరంపై ప్రయోగాలు చేయొద్దు..

మానవ శరీరంపై ఇష్టారాజ్యంగా ప్రయోగాలు చేయకూడదన్న కీలకమైన విషయాన్ని వైద్యులు సూచిస్తున్నారు. మనిషి మనిషికి వారి అలవాట్లలో తేడాలుం టాయి. వారి శరీర నిర్మాణంలోనూ తేడాలుంటాయి. కొందరికి కొన్ని రకాల ఆహార పదార్థాలు తింటే సరిపడదు. వారికి అలర్జీలు వస్తాయి. కొందరికి కొన్ని రకాల మందులు కూడా సరిపడవు. ప్రతి మనిషి వారి వాతావరణ పరిస్థితులు, చిన్నప్పటి నుంచి వారి ఆహా ర అలవాట్లను బట్టి అనేక రకాల తేడాలు ఉంటాయి. కాబట్టి ఏదైనా జబ్బు కానీ, అనారోగ్య సమస్యగానీ వస్తే డాక్టర్‌ను సంప్రదించే నిర్ణయం తీసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. కొందరు షుగర్ పరీక్షలు చేయించుకుంటారు. సాధారణం కంటే కాస్తంత ఎక్కువ కనిపిస్తే తనకు షుగర్ ఉందని ఫిజీషి యన్‌ను కలవకుండానే నిర్ధారించుకుంటారు.

### ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో వస్తే సరే..

ప్రస్తుతం యాప్‌లు, వెబ్‌సైట్లు, ఆన్‌లైన్ వీడియోలు సాధారణ లక్షణాలను మాత్రమే చెబుతుం టాయి. అదే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీతో మున్ముం దు యాప్‌లు రానున్నాయి. అవి కొంతమేరకు ప్రాక్టికల్‌గా ఉండే అవకాశముందని వైద్యులు అంటున్నారు. ఏదేమైనా వైద్యుడిని సంప్రదించకుండా ఆన్‌లైన్ వైద్యం ఏమాత్రం మంచిదికాదని స్పష్టం చేస్తున్నారు.

### గుడ్డిగా అనుకరించొద్దు



“యాప్‌లు, వెబ్‌సైట్లలో ఆరోగ్య సమాచారం చూసి గుడ్డిగా ఫాలో కాకూడదు. వైద్యుల ప్రమేయం లేకుండా ఆహారంలో మార్పులు చేర్పులు అనవసరంగా చేయకూడదు. దీనివల్ల మన శరీర సహజ లక్షణం మారిపోతుంది.

– డాక్టర్ కృష్ణ ప్రభాకర్, పిజీషియన్, సిటీన్యూరో, హైదరాబాద్